క్లుప్తంగా

శ్రీతిరుపతమ్మ వారి ఆలయానికి రూ.లక్ష విరాళం



పెనుగంచిప్రోలు: ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు గ్రామంలో ఉన్న శ్రీతిరుపతమ్మ వారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి గురువారం పల్నాడు జిల్లా నరసరావుపేటకు చెందిన సుంకర శ్రీనివాసరావు, మాధురి దంపతులు రూ.50,116, కీ.శే సుంకర చెంచయ్య, బాయమ్మల పేరు మీద గోశాలలో గోవుల సంరక్షణకు రూ.50,116 ఏఈవో తిరుమలేశ్వరరావు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ అధికారులు అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి హైదరాబాద్‌కు చెందిన భక్తులు గురువారం రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన తాతినేని శేషగిరిరావు కుటుంబ సభ్యులు నిత్యాన్నదానానికి రూ.1,01,116ల విరాళాన్ని ఆలయ అధికారులకు అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

దుర్గమ్మ సన్నిధిలో కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో ఢిల్లీకి చెందిన పలువురు చిన్నారులు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై ఢిల్లీలోని శ్రీధృయా నృత్య కళానిలయానికి చెందిన విద్యార్థులు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. నృత్యాచార్య అయ్యనా ముఖర్జీ పర్యవేక్షణలో కళాకారులు పలు కీర్తనలకు చక్కటి హావభావాలతో నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి పంచహారతుల అనంతరం కళావేదిక వద్దకు చేరుకున్న భక్తులు చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శనను ఆద్యంతం ఎంతో ఆసక్తితో వీక్షించారు. అనంతరం శిష్య బృందానికి అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు ప్రసాదాలను అందజేశారు.

కార్పొరేటర్ నరేంద్రకు పరామర్శ

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడి గొల్లపూడి ఆంధ్రా హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న 39వ డివిజన్ కార్పొరేటర్ గుడివాడ నరేంద్ర రాఘవను పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి నరేంద్ర ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్పొరేటర్ నరేంద్ర రాఘవ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. నరేంద్రను పరామర్శించినవారిలో కార్పొరేటర్ బుల్లా విజయ్ కుమార్, కూటమి నాయకులు యేదుపాటి రామయ్య, పత్తి నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

మూడు రోజుల్లోగా వేలాడే కేబుల్ వైర్లు తొలగించాలి

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరంలో అన్ని ప్రాంతాల్లో ఇంటర్నెట్, కేబుల్ వైర్లు వేలాడుతూ ప్రజలకు ప్రమాదకరంగా, అసౌకర్యంగా మారుతున్నాయని వీటిని వెంటనే తొలగించాలని వీఎంసీ సర్కిల్-3 అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహన్‌బాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. దీనిపై ఇటీవల వీఎంసీ సిటీ ప్లానర్, ఇతర అధికారులు, కేబుల్ ఆపరేటర్లు, నెట్ ఆపరేటర్లతో కూడా సమావేశం నిర్వహించామని, సదరు సమావేశానికి కొంతమంది ఆపరేటర్లు మాత్రమే వచ్చారని అన్నారు. మూడు రోజుల్లోగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో స్తంభాలకు వేలాడుతున్న కేబుల్ వైర్లను తొలగించాలని, లేని పక్షంలో ఏపీఎంసీ -1955 చట్టం ప్రకారం వీఎంసీ అదనపు నోటీసులు ఇవ్వకుండా వేలాడుతున్న కేబుల్ వైర్లను తొలగిస్తామని, కేబుల్ ఆపరేటర్లు సహకరించాలని అన్నారు.

నేడు న్యాయవాదులు విధుల బహిష్కరణ

విజయవాడలీగల్: తెనాలిలో పోలీసులు జరిపిన దౌర్జన్యకాండను ఖండిస్తూ కృష్ణాజిల్లా బార్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం కృష్ణా జిల్లాలోని అన్ని బార్ అసోసియేషన్ల న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించనున్నట్లు బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏకే బాషా గురువారం తెలిపారు. పోలీసులు ముమ్మాటికీ మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడ్డారని, బాధితులకు సంఘీభావం తెలిపేందుకు కోర్టు విధులు బహిష్కరణ చేస్తూ పిలుపునిచ్చారు.

తరగని అభిమానం







తాత వైఎస్ రాజారెడ్డి శతజయంతిని పురస్కరించుకుని మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం నిర్మల హృదయ భవన్‌లో కొద్దిసేపు అనాథ పిల్లల సమక్షంలో గడిపారు. సతీమణి వైఎస్ భారతి, మేనత్త విమలమ్మ, ఇతర కుటుంబ సభ్యులతో కలసి శిశుభవన్‌ను సందర్శించి అనాథ పిల్లలను ఆప్యాయంగా పలకరించారు. వారి మధ్య కేక్ కట్ చేశారు. జగనన్న వచ్చారన్న సంగతి తెలిసి పరిసర ప్రాంత ప్రజలు పెద్ద ఎత్తున అక్కడకు చేరుకున్నారు. మహిళలు ఆయన కారుకు గుమ్మడికాయతో దిష్టి తీసి హారతులిచ్చారు. జగనన్నతో సెల్ఫీలు దిగారు. పెద్ద సంఖ్యలో గుమిగూడిన అభిమానులకు జగన్ కారులో నిలబడి అభివాదం చేశారు.

-కృష్ణలంక(విజయవాడతూర్పు)

వారి నిర్లక్ష్యం.. వీరికి శాపం



యూజీడీ గుంతల్లో దిగబడిన భారీ వాహనం



దిగబడిన వాహనాన్ని క్రేన్ల సాయంతో పైకి తీసేందుకు యత్నిస్తున్న దృశ్యం

ఎరక్క పోయి వచ్చి ఇరుక్కు పోతున్నాయి

- తూతూ మంత్రంగా యూజీడీ గోతులు పూడ్చివేత
- గుంతల్లో దిగబడిపోతున్న భారీ వాహనాలు
- పట్టించుకోని నగర పాలక సంస్థ అధికారులు
- నిత్యం ఎదురవుతున్న ట్రాఫిక్ సమస్య

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగర పాలక సంస్థ అధికారుల నిర్లక్ష్యం వాహన యజమానులకు శాపంగా మారింది. గోతులు తీసి వాటిల్లోని మట్టితోనే తూతూ మంత్రంగా పూడ్చివేసి చేతులు దులుపుకొని ఎంచక్కా వెళ్లిపోతున్నారు. గుంతలపై మట్టి చూసి పూడ్చేశారు కదా అని లారీలు, భారీ వాహనాల డ్రైవర్లు వాటి మీదుగా వచ్చేయడంతో వాహనాలు దిగబడిపోతున్నాయి. దీంతో ఎరక్క పోయి వచ్చాము..ఇరుక్కు పోయాము అని వాహన యజమానులు తలలు పట్టుకుంటున్నారు. దిగబడిపోయిన వాహనాలను పైకి లేపటానికి వారు పడే అవస్థలు వర్ణనాతీతం. ఎంతో విలువైన డబ్బుతో పాటు సమయం కూడా వృథా అవుతోందని వాపోతున్నారు. పశ్చిమ నియోజకవర్గం గట్టు వెనుక ప్రాంతంలోని ఊర్మిళానగర్ మెయిన్ రోడ్ చివర మలుపులో ఈ పరిస్థితి ఉంది. ఊర్మిళానగర్ నుంచి కబేళా వైపు వెళ్లే మలుపులో భూగర్భ డ్రెయినేజి పనుల నిమిత్తం ఇటీవల పెద్ద ఎత్తున తవ్వేశారు. పనులు పూర్తయిన తరువాత తీసిన గోతులను ఆ గోతుల్లోని మట్టితోనే పూడ్చేశారు. వాస్తవానికి తీసిన గుంతల్లో కంకర చిప్స్, డస్ట్ వేసి దానిపై గట్టి మట్టి వేసి పటిష్టంగా పూడ్చాల్సి ఉంది. అయితే అటువంటి నిబంధనలను పాటించకపోవడంతో వాహనాలు గోతుల్లో దిగబడిపోవడం పరిపాటిగా మారింది.

హైదరాబాద్ వైపు నుంచి వచ్చే వాహనాలన్నీ ఈ మార్గంలోనే...

హైదరాబాద్ వైపు నుంచి విజయవాడకు వచ్చే లారీలు, భారీ వాహనాలన్నీ గొల్లపూడి వై.జంక్షన్ నుంచి బైపాస్ రహదారి మీదుగా అట్కిన్‌సన్ స్కూల్ జంక్షన్ వద్దకు వచ్చి అక్కడ నుంచి టర్న్ తీసుకుని ఊర్మిళానగర్, కబేళా సెంటర్ వరకు వెళ్లి సీవీఆర్ ఫ్లై ఓవర్ పైనుంచి ప్రయాణించాలి. నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ఈ మార్గంలో ఊర్మిళానగర్ దగ్గరకు వచ్చేసరికి అక్కడ మున్సిపల్ కార్పొరేషన్ తీసిన గోతుల్లో వాహనాలు దిగబడిపోతున్నాయి. ఈ క్రమంలో బుధవారం ఉదయం ఇబ్రహీంపట్నం నుంచి కాంక్రీట్ మిక్స్‌తో వస్తున్న 16 టైర్ల భారీ వాహనం ఈ గుంతల్లో దిగబడి పోయింది. సుమారు 35 టన్నుల బరువు గల కాంక్రీట్ మిక్స్‌తో పాటు 15 టన్నుల బరువున్న వాహనం (మొత్తం 50 టన్నులు) కావడంతో దాన్ని పైకి తీసుకురావడానికి మూడు క్రేన్లు తీసుకురావలసి వచ్చింది. రెండు మూడు రోజులుగా ఇక్కడ ఇదే తంతు అని స్థానికులు చెబుతున్నారు. తద్వారా ట్రాఫిక్ సమస్యలు కూడా ఎదురవుతున్నాయని అంటున్నారు. ఈ సమస్యను పరిష్కరించాల్సిన నగరపాలక సంస్థ అధికారులు మాత్రం చోద్యం చూస్తుండటం గమనార్హం.

బాల సాహిత్యం విస్తృతం కావాలి



బాల రామాయణం, భారతం పుస్తకాలను ఆవిష్కరిస్తున్న అతిథులు

విజయవాడ కల్చరల్: బాల సాహిత్యం విస్తృతం కావాలని, అది బాల బాలికలకు అందుబాటులో ఉంచాలని సాహితీ ప్రచురణల నిర్వాహకురాలు లక్ష్మి పేర్కొన్నారు. గ్రంథాలయ పునర్వికాస వేదిక, విజయవాడ బుక్‌ఫెస్టివల్ సొసైటీ, స్వేచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ ఆధ్వర్యాన గవర్నర్‌పేటలోని బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యాలయంలో నిర్వహిస్తున్న వర్క్‌షాప్‌లో గురువారం ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ బాల బాలికలకు చదవడం, సమీక్ష చేయడం అలవాటు చేయాలని సూచించారు. బాల బాలికల కోసం సరళమైన భాషలో పుస్తకాలు రావాలని తెలిపారు. గ్రంథాలయ పునర్వికాస వేదిక నాయకుడు గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ భారత రామాయణాల పట్ల అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం ప్రకృతి సూత్రాలు, బాల రామాయణం, భారతం పుస్తకాలను అతిథులు ఆవిష్కరించారు. కథలు రాయడం, మంచి పుస్తకం చదవడం ఎలా?, డిజిటల్ లైబ్రరీస్ అంశంగా బాల బాలికలకు శిక్షణ నిచ్చారు. కార్యక్రమంలో పునర్వికాస వేదిక సభ్యులు లక్ష్మయ్య, ఏబీఎస్ సాయిరాం, బీ రవికుమార్, వివిధ రంగాలకు చెందిన రహ్మానుద్దీన్, నిహారిక, పర్వానీ పాల్గొన్నారు.

నూతన చెత్త తరలింపు వాహనాలను అందించాలి



సింగ్ నగర్ గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): వ్యర్థాల నుంచి సంపదను సృష్టించే చర్యల్లో ఎలాంటి అంతరాయం ఉండకూడదని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. నగర పర్యటలో భాగంగా ఆయన గురువారం అజిత్ సింగ్ నగర్, గార్బేజ్ ట్రాన్స్ఫర్ స్టేషన్, అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నేషనల్ సఫాయి కర్మచారి పథకంలో భాగంగా కొత్తగా వచ్చిన ఐదు పెద్ద టిప్పర్ వాహనాలను పరిశీలించారు. లబ్ధిదారులతో పెద్ద టిప్పర్లను సాధ్యమైనంత త్వరలో అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. గార్బేజ్ ట్రాన్స్ఫర్ స్టేషన్లో వ్యర్థాల నుంచి సంపద సృష్టిస్తున్న చర్యలను ఎటువంటి అంతరాయం లేకుండా చేస్తూనే ఉండాలని, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించే విధంగా ఎప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్ రెడ్డి, ఇన్‌చార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకష్ణ నాయక్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాస్, వెహికల్ డిపో ఇన్‌చార్జ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఏసుపాదం తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నిరోధంపై అవగాహన



వెహికల్ డిపోలో అగ్నిప్రమాదాల నిరోధంపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

పటమట(విజయవాడతూర్పు): అగ్ని ప్రమాదాలపై అందరికీ అవగాహన ఉండాలని, ప్రమాదాల నుంచి తమను తాము రక్షించుకునే నైపుణ్యం పెరగాలని వీఎంసీ రీజనల్ ఫైర్ అధికారి వెంకటేశ్వరరావు అన్నారు. హనుమాన్‌పేటలోని వీఎంసీ వెహికల్ డిపోలో గురువారం కార్మికులకు అగ్నిప్రమాదాలపై డెమో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అగ్ని ప్రమాదం జరగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన నిరోధక చర్యలు, అగ్ని ప్రమాద నిరోధక పరికరాలను ఉపయోగించే విధానం, అగ్ని ప్రమాదం జరిగినప్పుడు మంటలను ఎలా ఆర్పాలి, ఎలాంటి పరికరాలను ఉపయోగించాలి, ఫైర్ స్ప్రింక్లర్స్, స్మోక్ డిటెక్టర్స్, ఎక్కడెక్కడ అమర్చాలి, వాటి వలన స్మోక్ అలారం ఎలా వస్తుంది, అగ్ని ప్రమాదం జరగకుండా డిపో చుట్టూ ఫైర్ సేఫ్టీ మెజర్స్ ఏమేం ఉండాలి వంటి విషయాలపై వారికి అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదం జరిగితే ఫైర్ ఎక్స్టింగ్ షేర్ వినియోగించి మంటలను ఆర్పాలనే విషయాలపై సిబ్బంది, కార్మికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వెహికల్ డిపో ఇన్‌చార్జి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ యేసుపాదం, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ రాజా, వెహికల్ డిపో సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలపై వైద్యాధికారులకు శిక్షణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుహాసినీ

పటమట(విజయవాడతూర్పు): ఎన్టీఆర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.సుహాసిని ఆధ్వర్యాన జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంత వైద్యాధికారులకు మూడు రోజుల పాటు జరిగే వ్యాధి నిరోధక టీకాల శిక్షణ కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. గవర్నర్ పేటలోని ఐఎంఏ హాలులో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఎం.శరత్‌బాబు పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం.సుహాసిని మాట్లాడుతూ ఈ శిక్షణ జిల్లాలో వైద్యాధికారులు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని బలోపేతం చేయడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. వైద్యాధికారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిక్షణలో సర్వైలెన్స్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భవాని,"యూనిట్ వైద్యాధికారి డాక్టర్ వాసంతి ట్రినర్లుగా వ్యవహరించారు. కార్యక్రమంలో డెప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఇందుమతి, డీఎంఓ మోతీబాబు, పట్టణ ఆరోగ్య కేంద్రం, గ్రామీణ ప్రాంత వైద్యాధికారులు, పర్యవేక్షకులు యలమందయ్య, రాజ్ వర్ధన్ పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా నగరాభివృద్ధి



స్థాయీ సంఘం సమావేశంలో మాట్లాడుతున్న వీఎంసీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి

వీఎంసీ స్థాయీ సంఘం సమావేశంలో మేయర్ భాగ్యలక్ష్మి

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నామని మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో గురువారం ఆమె స్థాయీ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మొత్తం 36 అంశాలు చర్చకు రాగా అందులో 33 అంశాలను ఆమోదిస్తూ తీర్మానం చేశారు. ఒక అంశాన్ని కౌన్సిల్‌కు సిఫారసు చేశారు. ఒక అంశాన్ని ర్యాటిఫై చేయగా, మరొక అంశాన్ని రికార్డు చేశారు. ఒక అంశాన్ని ధ్రువీకరిస్తూ తీర్మానం చేశారు.

ప్రధానాంశాలు :

- సర్కిల్-2 పరిధిలోని 27వ డివిజన్ సీతారామపురం కొత్తవంతెన ఎదురుగా ఉన్న బావాజీపేట మూడో లైన్ వరకు, బావాజీపేట 3వ లైన్ నుంచి విజయటాకీస్ వరకు రెండు పార్శ్వలుగా రైవస్ కాల్వ కట్టను సుందరీకరణ చేయటానికి రూ.99.96 లక్షలు వీఎంసీ సాధారణ నిధుల నుంచి మంజూరు చేయాలని వచ్చిన అంశాన్ని ఆమోదిస్తూ తీర్మానించారు.
- నగర శివారు జక్కంపూడిలోని వీఎంసీ మురుగు నీటి శుద్ధి ప్లాంట్(ఎస్‌టీపీ)లో ఉన్న రెండు అంతర్గత రోడ్లు కచ్చా రోడ్లు మరమ్మతులకు గురయ్యాయని, ఈ రెండు రోడ్డులను తారురోడ్డుగా నిర్మించేందుకు అవసరమయ్యే నిధులు రూ.49.90 లక్షలను వీఎంసీ జనరల్ ఫండ్స్ నుంచి కేటాయింపులు చేయాలని వచ్చిన ప్రతిపాదనపై కమిటీ ఆమోదిస్తూ తీర్మానం చేసింది.

3 నుంచి నవగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు

మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో నవగ్రహ విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలను నిర్వహించేందుకు వైదిక కమిటీ నిర్ణయించింది. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ఆలయ ఈవో వీకే శీనానాయక్ ఆదేశాలు జారీ చేశారు. విగ్రహ ప్రతిష్ట అనంతరం జూన్ 6వ తేదీ నుంచి నవగ్రహ పూజలకు భక్తులను అనుమతిస్తారు. 3వ తేదీ ఉదయం విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, అఖండ దీపారాధన, అంకురార్పణ, క్షీరాధివాసం జరుగుతాయి. సాయంత్రం కలశస్థాపన, అగ్నిప్రతిష్టాపన, మండపారాధన, అధివాసాలు జరుగుతాయి. 4వ తేదీ పలు విశేష పూజలను నిర్వహిస్తారు. ఇక 5వ తేదీ ఉదయం 7-52 గంటలకు నవగ్రహ ప్రతిష్ట, మంత్ర ప్రతిష్ట జరుగుతాయి. అనంతరం పూర్ణాహుతి, కలశోద్వాసన, మార్జనం , ప్రసాద వితరణ జరుగుతాయి.

సీనియర్ రెసిడెంట్స్ నియామకపు నోటిఫికేషన్

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరంలోని ప్రభుత్వ దంత వైద్యశాల, కళాశాలల్లో పిడోడింటిక్స్, పెరియోడోన్టిక్స్ విభాగాల్లో ఖాళీగా ఉన్న సీనియర్ రెసిడెంట్స్ నియామకానికి ప్రభుత్వ దంత వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కొలకాని శ్రీనివాస్ గురువారం నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. ఈ పోస్టులకు ఇంటర్వ్యూలు జూన్ 6వ తేదీన ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందని, ఆసక్తి కలిగిన అభ్యర్థులు హెచ్‌టీటీపీ://జీడీసీహెచ్‌వీజేఏ డాట్‌ఇన్ వెబ్‌సైట్‌లో సంప్రదించాలని నోటిఫికేషన్‌లో ప్రకటించారు.

భార్యను వేధిస్తున్న భర్తపై కేసు

పాయకాపురం(విజయవాడరూరల్): భార్యను వేధిస్తున్న భర్తపై నున్న పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుందరయ్యనగర్‌కు చెందిన దువ్వారపు దేవి నాలుగు ఏళ్ల క్రితం తులసీరామ్‌ను ప్రేమ వివాహం చేసుకుంది. వారికి ఒక కుమారుడు. అయితే దేవి ప్రస్తుతం నాలుగు నెలల గర్భిణి. ఆమె సేల్స్ గర్ల్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. దేవి భర్త పనికి వెళ్లకుండా ప్రతిరోజూ మద్యం తాగి వచ్చి ఆమెను మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

ఆకట్టుకుంటున్న నేషనల్ సిల్క్ ఎక్స్‌పో-2025



సిల్క్ ఎక్స్‌పోలో చీరలను ప్రదర్శిస్తున్న దృశ్యం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): స్థానిక బందరురోడ్డులోని ఏ-ప్లస్ కన్వెన్షన్ సెంటర్‌లో గురువారం నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ప్రారంభమైంది. ఈ ఎక్స్‌పోలో జూన్ 2వ తేదీ వరకు 5 రోజుల పాటు వస్త్ర ప్రదర్శన, అమ్మకాలు నిర్వహిస్తామని ఎక్స్‌పో నిర్వాహకులు తెలిపారు. దేశంలోని విభిన్న ప్రాంతాల సంస్కృతి, సంప్రదాయాలు మిళితమై వేలాది రకాల మగ్గాల ఉత్పత్తులు అన్నింటిని ఈ ప్రదర్శన ద్వారా నగర వాసులకు అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. పట్టు, కాటన్ వస్త్రాలు, డిజైన్ వస్త్రాలు, డిజైనర్ బ్లౌజులు, కుర్తీలు మొదలైనవి 50 శాతం వరకు తగ్గింపుతో ఈ ఎక్స్‌పోలో విక్రయిస్తున్నట్టు తెలిపారు. ప్రతిరోజు ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రదర్శన ఉంటుందని, ప్రవేశం ఉచితమని నిర్వాహకులు తెలిపారు.

కళాకారులు సాంస్కృతిక వారధులు

విజయవాడ కల్చరల్: కళాకారులు సాంస్కృతిక వారధులని డెప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎం. కృష్ణమూర్తి నాయుడు పేర్కొన్నారు. తెలుగు కళావాహిని, శ్రీకళాభారతి, కామ్రేడ్ జీఆర్‌కే పోలవరపు సాహితీ సమితి, పద్మశ్రీ ఘంటసాల చైతన్యవేదిక ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికపై గురువారం ఎన్టీఆర్ జయంతి వేడుకలు, సినీ సంగీత విభావరి, ఎన్టీఆర్ స్మారక పురస్కారాలు ప్రదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాకారుల్లోని ప్రతిభను ప్రోత్సహించి వారి సంక్షేమం కోసం కళా సంస్థలు కృషి చేయాలని సూచించారు. అలాగే ఎన్టీఆర్ కారణజన్ముడని పేర్కొన్నారు. శ్రీ కళాభారతి వ్యవస్థాపకుడు సింగంశెట్టి చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని కోరారు. అనంతరం మీరాకుమార్, టీవీ శేషగిరిరావు, కేబీ బ్రహ్మానందరావు, ముష్టి శ్రీనివాస్, రుత్తుల లక్ష్మీదేవి, నండూరి రామానుజాచార్యులు, ఎస్వీ కనకారావు, రాజు, కుంచం మోహనరావు, కేవీ రెడ్డిలకు ఎన్టీఆర్ పురస్కారాలను ప్రదానం చేశారు. గాయనీ గాయకులు ఎన్టీఆర్ నటించిన చిత్రాల్లోని గీతాలను ఆలపించారు. వివిధ సంస్థల ప్రతినిధులు గోళ్ల నారాయణరావు, చింతకాయల చిట్టిబాబు, కే డేవిడ్‌రాజు, బీవీ వీరభద్రరావు, సాహితీవేత్త డాక్టర్ ప్రభాకర్ పాల్గొన్నారు.

నేడు పవిత్ర సంగమం వద్ద క్రీడా పోటీలు

ఇబ్రహీంపట్నం: యోగాంధ్ర మాసోత్సవాలను పురస్కరించుకుని కొండపల్లి మున్సిపాల్టీ పరిధిలో ఇబ్రహీంపట్నం పవిత్ర సంగమం వద్ద వివిధ రకాల యోగా, ఆటల పోటీలు శుక్రవారం సాయంత్రం ఐదు గంటలకు నిర్వహిస్తామని యోగా గురువు లంకే జనార్దన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వయస్సును బట్టి మూడు విభాగాలుగా క్రీడలు నిర్వహిస్తామన్నారు. సూర్య నమస్కారాలు, యోగాసనాలు, ఆర్టిస్టిక్ యోగా, పాటలు, పెయింటింగ్, స్కిట్, క్విజ్ తదితర పోటీలు జరుగుతాయని చెప్పారు. మరిన్ని వివరాల కోసం సెల్: 63014 54859 నంబర్‌ను సంప్రదించాలన్నారు.